సాక్షి
నిజామాబాద్
శనివారం ၊ 9 ၊ మార్చి ၊ 2024



ఎట్టకేలకు గెజిట్

ఆర్మూర్ మున్సిపల్ చైర్‌పర్సన్ పండిత్ వినీతపై ప్రవేశపెట్టిన అవిశ్వాసం నెగ్గినట్లు రాష్ట్ర ప్రభుత్వం గెజిట్ విడుదల చేసింది.

- 8లో ▸



పశువుల ఎరువు.. ధర దరువు

పశువుల పేడ ధరకు రెక్కలు రావడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. లారీ ఎరువు రేటు రూ. 42వేలకు చేరింది.

- 8లో ▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం
36.2 /20.5

ఉదయం ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. క్రమంగా ఎండ తీవ్రత పెరుగుతుంది. రాత్రి చలితీవ్రత కొనసాగుతుంది.

న్యూస్‌రీల్

అడవికి నిప్పు



ఇందల్వాయి: ఇందల్వాయి వద్ద 44వ నంబరు జాతీయ రహదారి పక్కన అటవీ ప్రాంతంలో గుర్తు తెలియని వ్యక్తులు శుక్రవారం నిప్పు పెట్టడంతో సుమారు కిలోమీటరు మేర అడవి అగ్నికి ఆహుతి అయ్యింది. సమాచారం అందుకున్న అటవీ శాఖ అధికారులు ఘటనా స్థలికి చేరుకుని మంటలను ఆర్పి వేశారు. అడవుల్లో నిప్పు పెట్టడం వల్ల ఎదుగుతున్న చెట్లు కాలి పోవడమే కాకుండా వన్య ప్రాణులు తమ ఆవాసాలను కోల్పోతాయని ఎఫ్ఆర్వో రవి మోహన్ భట్ పేర్కొన్నారు. పశువుల కాపర్లు, తునికాకు సేకరించే వారు తమ స్వప్రయోజనాల కోసం అడవులకు నిప్పు పెట్టవద్దని సూచించారు.

జహీరాబాద్ కాంగ్రెస్ అభ్యర్థిగా షెట్కార్

సాక్షి, కామారెడ్డి: జహీరాబాద్ లోక్‌సభ స్థానం నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా మాజీ ఎంపీ సురేశ్ కుమార్ షెట్కార్ బరిలో నిలవనున్నారు. ఆ పార్టీ శుక్రవారం విడుదల చేసిన తొలి జాబితాలో ఆయన పేరుంది. సురేశ్‌షెట్కార్‌ది రాజకీయ కుటుంబం. ఆయన తాత అప్పారావ్ షెట్కార్ నారాయణఖేడ్ ఎమ్మెల్యేగా రెండుసార్లు పనిచేశారు. తండ్రి శివరావ్ షెట్కార్ మూడుసార్లు ఎమ్మెల్యేగా వ్యవహరించారు. సురేశ్ షెట్కార్ 2004లో నారాయణఖేడ్ అసెంబ్లీ నియోజకవర్గంనుంచి స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేసి గెలిచారు.

సమాజ మార్పులో మహిళల పాత్ర కీలకం



సుభాష్‌నగర్: సమాజ మార్పులో మహిళల పాత్ర కీలకమని, స్త్రీలు అనుకుంటే మార్పు తథ్యమని అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ పేర్కొన్నారు. శుక్రవారం నగరంలోని మారుతీనగర్‌లో ఆర్యవైశ్య మహిళా సంఘం ఆధ్వర్యంలో మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఏడాదంతా మహిళలను గౌరవిస్తే అత్యాచారాలు, అఘాయిత్యాలు తగ్గుతాయ ని తెలిపారు. ప్రధాని మోదీ మహిళలకు గౌరవిస్తూ సుకన్య సంవృద్ధి యోజన కార్యక్రమాన్ని అమలు చేస్తున్నారని పేర్కొన్నారు. త్రిపుల్ తలాక్‌ను రద్దు చేసి ముస్లిం మహిళలకు సమాజంలో గౌరవాన్ని కల్పించారని గుర్తుచేశారు. ప్రభుత్వం మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు కల్పించిందని, మహిళలు అన్నిరంగాల్లో రాణించాలని పిలుపునిచ్చారు. అనంతరం మహిళలను ఘనంగా స న్మానించారు. ఆర్యవైశ్య మహిళా సంఘం ప్రతినిధులు, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

లారీని ఢీకొని తండ్రీకొడుకుల మృతి

- డయాలసిస్ కోసం వెళ్తుండగా ఘటన



రవీందర్, శివరాజ్(ఫైల్)

వేల్పూర్/మోర్తాడ్(బాల్కొండ): వేల్పూర్ మండలం అంక్సాపూర్ శివారులో 63 నంబరు జాతీయ రహదారిపై శుక్రవారం వేకువజామున ఆగిఉన్న లారీని బైక్ ఢీకొని తండ్రీ కొడుకులు మృతి చెందారు. మోర్తాడ్ మండలం దొన్కల్‌కు చెందిన మాడవేడి రవీందర్(54) కిడ్నీలు చెడిపోవడంతో అతనికి డయాలసిస్ చేయిస్తున్నారు. ఈ క్రమంలో కొడుకు శివరాజ్(24) తండ్రిని బైక్‌పై ఎక్కించుకొని నిజామాబాద్ వెళ్తున్నారు. వేకువజామున చీకటిగా ఉండడంతో అంక్సాపూర్ శివారులో ఆగిఉన్న లారీని గమనించక దానికి బలంగా ఢీట్టారు. తండ్రీకొడుకులకు బలమైన గాయాలు తగలడంతో అక్కడిక్కడే మరణించారు. అజాగ్రత్తగా రోడ్డుపై లారీని నిలిపిన డ్రైవర్ ఫహీమ్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై వినయ్‌కుమార్ తెలిపారు. ఘటనా స్థలాన్ని ఆర్మూర్ రూరల్ సీఐ శ్రీనాథ్‌రెడ్డి పరిశీలించారు. చేపలు పట్టుకుని జీవించే రవీందర్ ఆరోగ్యం దెబ్బతినడంతో అతని కుమారుడు శివరాజ్ చదువు మానేసి తండ్రి వృత్తిని స్వీకరించాడు. ఒకవైపు తండ్రికి వైద్యం చేయిస్తూనే కుటుంబాన్ని పోషిస్తున్నాడు. ఇంటికి ఆధారమైన రవీందర్, శివరాజ్‌లు మరణించడంతో వారి కుటుంబానికి పెద్ద దిక్కులేకుండా పోయింది.

మహాదేవుడికి నీరాజనం

దొంకేశ్వర్ వద్ద ఎస్సారెస్పీ బ్యాక్‌వాటర్‌లో తేలిన శివలింగానికి పూజలు





నగరంలోని ఉమామహేశ్వరాలయంలో అభిషేకం చేస్తున్న భక్తులు





మహా శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని జిల్లాలోని శైవక్షేత్రాలు శివ నామస్మరణతో మార్మోగాయి. శుక్రవారం ఉదయం నుంచే ఆలయాలకు భక్తులు పోటెత్తారు. మహాదేవుడి దర్శనం కోసం బారులు తీరారు. ఈ సందర్భంగా స్వామివారికి అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. జిల్లా కేంద్రంలోని నీలకంఠేశ్వరాలయం, శంభులింగేశ్వరాలయం, ఉమామహేశ్వరాలయం, బోధన్‌లోని ఏకచక్రేశ్వరాలయం, ఆర్మూర్‌లోని సిద్దుల గుట్ట, మల్లారంలోని లింగేశ్వర గుట్ట, నాగారంలోని నందిగుట్ట, నందిపేటలోని పలుగుట్ట, సిరికొండ మండలంలోని లొంక రామలింగేశ్వరాలయం తదితర ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. ప్రజాప్రతినిధులు, రాజకీయ నాయకులు, పలువురు ప్రముఖులు ఆలయాలను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.



నీలకంఠేశ్వర ఆలయంలో కోనేరు వద్ద శివలింగానికి అభిషేకం చేస్తున్న భక్తులు



నందిగుట్టలో నందీశ్వరుడి చెవిలో కోరికలు కోరుతున్న యువతి



నగరంలోని నీలకంఠేశ్వరాలయం వద్ద బారులుదీరిన భక్తులు

జాతీయ పార్టీల మధ్యే పోటీ!

- నిజామాబాద్ లోక్‌సభ స్థానంలో తాజా పరిస్థితి
- సిట్టింగ్ ఎంపీ అర్వింద్‌ను అభ్యర్థిగా ఖరారు చేసిన బీజేపీ అధిష్టానం
- కాంగ్రెస్ నుంచి ఖరారు కాని అభ్యర్థి
- రేసులో తాటిపర్తి జీవన్‌రెడ్డి, ముత్యాల సునీల్‌రెడ్డి
- బీఆర్ఎస్ నుంచి పరిశీలనలో బాజిరెడ్డి గోవర్ధన్, గణేశ్‌గుప్తా పేర్లు

రానున్న లోక్ సభ ఎన్నికల్లో నిజామాబాద్ నియోజకవర్గ పరిధిలో ప్రధానంగా బీజేపీ, కాంగ్రెస్ మధ్యే పోటీ ఉంటుందని రాజకీయ వర్గాలు విశ్లేషిస్తున్నాయి. బీజేపీ అధిష్టానం ఇప్పటికే సిట్టింగ్ ఎంపీ అర్వింద్‌ను అభ్యర్థిగా ఖరారు చేయగా కాంగ్రెస్ ఇంకా అభ్యర్థిని ప్రకటించలేదు. బీఆర్ఎస్ పార్టీ నుంచి అభ్యర్థి ఎవరో స్పష్టత లేకుండా పోయింది.

సాక్షి ప్రతినిధి, నిజామాబాద్ : మూణ్నాల్లు రోజుల్లో పార్లమెంట్ ఎన్నికల కోడ్ వెలువడనున్న నేపథ్యంలో ఎన్నికల వాతావరణం వేడెక్కింది. ఈ క్రమంలో నిజామాబాద్ లోక్‌సభ బరిలో జరగబోయే పోరుపై వివిధ వర్గాల్లో చర్చ సాగుతోంది. జాతీయ అంశాలు ఎక్కువగా ప్రభావితం చేసే లోక్‌సభ ఎన్నికల్లో ప్రధాన పోటీ జాతీయ పార్టీలైన బీజేపీ, కాంగ్రెస్ మధ్యే ఉంటుందనే వాదనలు వినిపిస్తున్నాయి. మూడు నెలల క్రితం రాష్ట్రంలో అధికారం కోల్పోయిన బీఆర్ఎస్ తరఫున పోటీచేసే అభ్యర్థి విషయంలో ఇప్పటి వరకు స్పష్టత రాలేదు. కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ సిట్టింగ్ ఎంపీ ధర్మపురి అర్వింద్‌నే అభ్యర్థిగా ఖరారు చేసింది. గత ఎన్నికల్లో కల్వకుంట్ల కవితను ఓడించిన అర్వింద్ ఈసారి రెట్టించిన ఉత్సాహంతో కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. శాసనసభ ఎన్నికల్లో నిజామాబాద్ లోక్‌సభ పరిధిలో బీజేపీ ఆర్మూర్, నిజామాబాద్ అర్బన్ సెగ్మెంట్లను గెలుచుకుంది. ఇతర సెగ్మెంట్లలో సైతం గణనీయమైన ఓట్లు సాధించింది. దీంతో పార్లమెంట్ ఎన్నికల్లో భారీ ఆధిక్యంతో గెలుస్తాననే ధీమాతో అర్వింద్ ముందుకెళ్తున్నారు.



- కాంగ్రెస్ విషయానికి వస్తే టికెట్టు రేసులో ఎమ్మెల్సీ తాటిపర్తి జీవన్‌రెడ్డి, ముత్యాల సునీల్‌రెడ్డి పేర్లు వినిపిస్తున్నాయి. జీవన్‌రెడ్డికి టికెట్టు ఖాయమంటూ ఆ పార్టీ సీనియర్ నాయకులు చెబుతున్నారు. అయితే ద్వితీయ శ్రేణి నాయకులు, యువ నాయకులు, కార్యకర్తలు మాత్రం సునీల్‌రెడ్డికి టికెట్టు ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు. ఈ టికెట్టు కోసం సినీ నిర్మాత దిల్ రాజు సోదరుడు నర్సింహారెడ్డి సైతం ఢిల్లీ స్థాయిలో తనవంతు ప్రయత్నాలు చేస్తున్నారు. ఇటీవల అగ్రనటుడు చిరంజీవితో కలిసి సీఎం రేవంత్ రెడ్డి వద్దకు వెళ్లి తనకు టికెట్టు ఇవ్వాలని కోరినట్లు తెలిసింది. శుక్రవారం కాంగ్రెస్ అధినాయకత్వం విడుదల చేసిన జాబితాలో నల్లగొండ, మహబూబ్‌నగర్, జహీరాబాద్, మహబూబాబాద్ అభ్యర్థులను ఖరారు చేసింది. ఇందులో నిజామాబాద్ అభ్యర్థిని పెండింగ్ పెట్టడం గమనార్హం. ఏ క్షణంలోనైనా సరే నిజామాబాద్ అభ్యర్థిని ఖరారు చేస్తారనే చర్చ నడుస్తోంది.
- బీఆర్ఎస్ అభ్యర్థి విషయానికి వస్తే ఇప్పటివరకు స్పష్టత లేదు. పార్టీ అధ్యక్షుడు కేసీఆర్ మాజీ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్‌ను బరిలోకి దించేందుకు ఆలోచన చేస్తున్నట్లు తెలుస్తోంది. అయితే బాజిరెడ్డి మొగ్గుచూపడం లేదని సమాచారం. ఈ క్రమంలో నిజామాబాద్ అర్బన్ మాజీ ఎమ్మెల్యే బిగాల గణేశ్‌గుప్తా పేరును సైతం పరిశీలిస్తున్నట్లు తెలుస్తోంది. ఇదిలా ఉండగా తెలంగాణ ఉద్యమకారుడైన జెడ్పీ చైర్మన్ దాదన్నగారి విఠల్‌రావుకు టికెట్టు కేటాయించాలంటూ ఉద్యమకారులు డిమాండ్లు చేస్తున్నారు.

విద్యార్థుల్లో నైపుణ్యాన్ని వెలికితీయాలి



బీసీ గురుకులాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే భూపతిరెడ్డి

- అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలతో మండలానికో పాఠశాల
- రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి
- బీసీ గురుకులాన్ని వర్చువల్‌గా ప్రారంభించిన సీఎం రేవంత్‌రెడ్డి

మోపాల్(నిజామాబాద్‌రూరల్): విద్యార్థుల్లో దాగి ఉన్న నైపుణ్యాన్ని గుర్తించి వెలికితీయాలని నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ భూపతిరెడ్డి పేర్కొన్నారు. అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన ఆదర్శ పాఠశాలను మండలానికొకటి నిర్మించేందుకు సీఎం రేవంత్‌రెడ్డి ప్రణాళికలు రూపొందిస్తున్నారని తెలిపారు. శుక్రవారం మండలంలోని కంజర్ శివారులో నూతనంగా నిర్మించిన మహాత్మా జ్యోతిబాపూలే బాలుర గురుకుల పాఠశాలను ముఖ్యమంత్రి హైదరాబాద్ నుంచి వర్చువల్‌గా ప్రారంభించారు. కార్యక్రమానికి అదనపు కలెక్టర్ అంకిత్, ఆర్డీవో రాజేంద్ర కుమార్, ఆర్‌సీవో సత్యనాథ్‌రెడ్డి, బీసీ సంక్షేమశాఖ అధికారి రమేశ్ హాజరయ్యారు. అనంతరం పాఠశాలలో ఏర్పాటుచేసిన సమావేశంలో ఎమ్మెల్యే భూపతిరెడ్డి మాట్లాడుతూ చాలామంది మేధావులు ప్రభుత్వ పాఠశాలల్లోనే విద్యనభ్యసించారని గుర్తు చేశారు. ప్రభుత్వ స్కూళ్లు, రెసిడెన్షియళ్లు కార్పొరేట్ స్కూళ్లకు దీటుగా విద్యనందిస్తున్నాయన్నారు. అత్యాధునిక వసతులతో కూడిన విద్యతోపాటు కంప్యూటర్ ల్యాబ్స్, ఇతర క్రీడ, సాంస్కృతిక అంశాల్లో విద్యార్థులు ముందంజలో ఉంటున్నారని తెలిపారు. విద్యార్థులు ఇష్టమైన రంగాన్ని ఎంచుకుని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని సూచించారు.

విద్యార్థులకు అన్ని వసతులు : అదనపు కలెక్టర్ అంకిత్

ప్రభుత్వ రెసిడెన్షియళ్లలో విద్యార్థులకు అన్నిరకాల వసతులు కల్పిస్తున్నట్లు అదనపు కలెక్టర్ అంకిత్ తెలిపారు. ప్రభుత్వ స్కూళ్లల్లో నాణ్యమైన విద్యతో పాటు భోజన వసతి కల్పిస్తుందన్నారు. కార్యక్రమంలో పీసీసీ డెలిగేట్ శేఖర్ గౌడ్, కిసాన్ కాంగ్రెస్ అధ్యక్షుడు ముప్ప గంగారెడ్డి, డీసీసీ ప్రధానకార్యదర్శి భాస్కర్‌రెడ్డి, సీనియర్ నాయకులు మునిపల్లి సాయిరెడ్డి, ఎల్లోల సాయిరెడ్డి, సూర్యారెడ్డి, మోహన్‌రెడ్డి, ప్రవీణ్‌రెడ్డి, ప్రతాప్‌సింగ్, గంగాప్రసాద్, సతీష్‌రెడ్డి, సంతోష్ పాల్గొన్నారు.

ప్రాణాలు పోతున్నా పట్టించుకోరా..



నీటిలో నుంచి మృతదేహాన్ని తీసుకువస్తున్న బాల్కొండ ఎస్సై గోపి

- ఎస్సారెస్పీలో ఏటా ప్రమాదాలు
- రక్షణ చర్యలు చేపట్టని అధికారులు
- ప్రతి ఏడులాగే శివరాత్రికి పుణ్యస్నానాలకు వచ్చిన గన్యా తండా వాసులు
- ఎస్సారెస్పీలో మునిగి ముగ్గురు యువకుల మృత్యువాత



లోకేశ్ మృతదేహం



సాయినాథ్ మృతదేహం



సాయికిరణ్ మృతదేహం

బాల్కొండ: శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్‌లో యేటా ప్రమాదాలు జరిగి ఎంతో మంది ప్రాణాలు కోల్పోతున్నారు. అయినా.. అధికారులు ఎలాంటి రక్షణ చర్యలు చేపట్టడం లేదు. శివరాత్రి పర్వదినాన శుక్రవారం గోదావరిలో స్నానానికి వచ్చిన జక్రాన్‌పల్లి మండలం గన్యా తండాకు చెందిన ముగ్గురు యువకులు నీట మునిగి ప్రాణాలు కోల్పోయారు. తండాకు చెందిన సుమారు 80 కుటుంబాల వారు ప్రతియేటా శివరాత్రి రోజు ఎస్సారెస్పీ వద్ద గల శివాలయంలో పూజలు చేసేందుకు వస్తారు. అలాగే ఈ సారి కూడా వచ్చారు. ఈ క్రమంలో తండాకు చెందిన సందీప్, వంశీ, అభిరాం, సాయినాథ్, సాయికిరణ్, లోకేశ్‌లు శుక్రవారం ఉదయం కారులో ప్రాజెక్ట్ వద్దకు చేరుకున్నారు. అందరు కలిసి ప్రాజెక్ట్‌లో స్నానమాచరించారు. వారిలో సాయినాథ్(16), సాయికిరణ్ అలియాస్ మున్నా(17), లోకేశ్(16) లు మట్టి అంటిందని మళ్లీ లక్ష్మి కాలువ హెడ్‌రెగ్యులేటర్ వద్ద ప్రాజెక్టు నీటిలోకి దిగిమునిగి పోయారు. మిత్రులను కాపాడేందుకు నీటిలోకి దిగిన వంశీకి ప్రమాదం ఏర్పడడంతో చాకచక్యంగా బయటపడ్డాడు. మిగతా మిత్రులు వెంటనే శివాలయం వద్ద ఉన్న తమ కుటుంబ సభ్యులకు ఫోన్‌లో సమాచారమిచ్చారు. సమాచారం అందుకున్న ఆర్మూర్ ఏసీపీ బస్వారెడ్డి, ఆర్మూర్ రూరల్ సీఐ శ్రీధర్‌రెడ్డి, బాల్కొండ, ముప్కాల్, మెండోరా ఎస్సై గోపి, భాస్కరాచారి, శ్రీనివాస్ యాదవ్‌లు ఘటనా స్థలికి చేరుకుని గజ ఈతగాళ్లతో గాలింపు చర్యలు చేపట్టారు. మృతదేహాలు కాలువ ద్వారా కొట్టుకుపోకుండా ఉండేందుకు ఇరిగేషన్ అధికారులతో మాట్లాడి లక్ష్మి కాలువ ద్వారా నీటి విడుదలను నిలిపివేశారు. చివరికి ముగ్గురి మృతదేహాలను గత ఈతగాళ్లు బయటకు తీశారు. మృతుల్లో సాయినాథ్, లోకేశ్ ఇంటర్ ఫస్టియర్ విద్యార్థులు. సాయికిరణ్ లారీపై సేంద్రియ ఎరువులను తరలించే పనిచేసేవాడు.

గేట్లుదించిన మృతుల బంధువులు

లక్ష్మి కాలువ హెడ్‌రెగ్యులేటర్ గేట్లను విద్యుద్దీకరించారు. కానీ ట్రాన్స్‌ఫార్మర్ చెడిపోవడంతో విద్యుత్ విధానం పనిచేయలేదు. దీంతో మృతుల బంధువులు గేట్లను దించేందుకు ఎంతో శ్రమించారు. గేట్లు సరిగ్గా పనిచేయకపోవడంపై పలువురు అసహనం వ్యక్తం చేశారు.

సాహసం చేసిన ఎస్సై

గాలింపు చర్యల్లో బాల్కొండ ఎస్సై గోపి నీటిలో పలుమార్లు మునిగారు. ఒకరి మృతదేహాన్ని కనుగొని నీటిలో నుంచి బయటకు తీసుకువచ్చి సాహసం చేశారు. ముగ్గురు యువకులు మృతి చెందడంతో గన్యాతండాలో తీవ్ర విషాదం నెలకొంది. యువకుల కుటుంబ సభ్యుల రోదనలు మిన్నంటాయి. ఇలా ఎస్సారెస్పీలో యేటా ఏదో ఒక ప్రమాదం జరుగుతూనే ఉంది. అయినా అధికారులు గుణపాఠం నేర్వలేదు. ఇంకెంత మంది ప్రాణాలు పోతే పట్టించుకుంటారంటూ బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

గతంలో సంభవించిన పలు ఘటనలు..

- 2007లో హైదరాబాద్ నుంచి ప్రాజెక్ట్ సందర్శనకు వచ్చిన ముగ్గురు యువకులు ప్రాజెక్ట్‌లో గల్లంతయ్యారు.
- 2021లో ప్రాజెక్ట్ వరదగేట్ల ముందు గోదావరి స్నానానికి వచ్చిన ఆరుగురు మరణించారు.
- 2022లో కోరుట్లకు చెందిన ఇద్దరు యువకులు గల్లంతయ్యారు.
- 2023లో గోదావరిలో మునిగి ఇద్దరు మృత్యువాత పడ్డారు.



కన్నీరు మున్నీరుగా విలపిస్తున్న మృతుల కుటుంబ సభ్యులు

హెచ్చరిక బోర్డుల ఏర్పాటు

ప్రాజెక్ట్‌లో 2022లో ఇద్దరు మృతి చెందడంతో ముప్కాల్ పోలీస్‌లు ప్రాజెక్ట్ లోపలికి వెళ్లొద్దని హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేశారు. అలాగే ప్రధాన దారుల వద్ద ప్రాజెక్టులోకి వెళ్లకుండా కందకం తవ్వారు. కానీ మొరం వ్యాపారులు కందకాలను పూడ్చివేశారు. దీంతో ప్రాజెక్ట్‌లో నీరు తగ్గగానే పర్యాటకులు నీటి అంచు వరకు వాహనాలపై వెళ్లి ప్రమాదాల భారిన పడుతున్నారు. ప్రాజెక్ట్‌లో, గోదావరిలో ప్రమాదాలు జరగకుండా చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

క్లుప్తంగా

లింగేశ్వర ఆలయాన్ని దర్శించుకున్న ఎంపీ



నిజామాబాద్‌ రూరల్‌: మండలంలోని మల్లారం శివారులో ఉన్న లింగేశ్వర ఆలయంలో శుక్రవారం ఎంపీ అర్వింద్‌ ప్రత్యేక పూజలు చేశారు. ఆలయానికి వెళ్లిన ఆయనకు పండితులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం లింగేశ్వర గుట్ట ఆశ్రమ వ్యవస్థాకుడు పిట్ల కృష్ణ మహరాజ్‌ ఆశీర్వాదం తీసుకున్నారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు దినేష్‌ కులాచారి, మండల నాయకులు పాల్గొన్నారు.

గల్ఫ్‌ నుంచి మృతదేహం తెప్పించాలని వినతి



ఆర్మూర్‌: భీమ్‌గల్‌ మండలం బడా భీమ్‌గల్‌కు చెందిన లొక్కిడి రాఘవేందర్‌(20) గల్ఫ్‌లోని బెహరన్‌లో శుక్రవారం గుండె పోటుతో మృతి చెందాడు. ఆయన మృతదేహాన్ని స్వగ్రామానికి తీసుకురావడానికి సహాయం చేయాలని కోరుతూ మృతుని తమ్ముడు లతీష్‌ ప్రవాస భారతీయుల సంక్షేమ, హక్కుల వేదిక రాష్ట్ర అధ్యక్షుడు కోటపాటి నర్సింహనాయుడును కోరాడు. ఈ మేరకు ఆర్మూర్‌లోని కోటపాటి కార్యాలయంలో శుక్రవారం కలిసి వినతి పత్రం అందించాడు. స్పందించిన ఆయన బెహరన్‌లోని ఇండియన్‌ ఎంబసీ అధికారులు, తెలుగు కళా సమితి అధ్యక్షుడు మురళికి ఫోన్‌ చేసి సమస్యను వివరించారు. ఈర్ల సాయిబాబ, గడ్డం శ్రీకాంత్‌, మారుతి తదితరులున్నారు.

అక్రమ మద్యంపై ఉక్కుపాదం

మోర్తాడ్‌:మోర్తాడ్‌ ఎక్సైజ్‌ సర్కిల్‌ పరిధిలోని వివిధ గ్రామాల్లో అక్రమ మద్యం అమ్మకాలను నియంత్రించడానికి కృషి చేస్తున్నామని సీఐ గుండప్ప తెలిపారు. శుక్రవారం కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ఏడాది కాలంలో మోర్తాడ్‌ సర్కిల్‌ పరిధిలోని మోర్తాడ్‌, ఏర్గట్ల, కమ్మర్‌పల్లి, వేల్పూర్‌ మండలాల్లో విస్తృతంగా దాడులు నిర్వహించి 146 కేసులను నమోదు చేసినట్లు వెల్లడించారు. 89 మందిని అరెస్టు చేసినట్లు తెలిపారు. గుడుంబా విక్రయాలపై దాడులు నిర్వహించి 44 కేసులను నమోదు చేసి 48 మందిని అరెస్టు చేశామన్నారు. 130 లీటర్ల అక్రమ మద్యం సీజ్‌ చేసి, 10,600 లీటర్ల వాష్‌ను ధ్వంసం చేసినట్లు వివరించారు. 11 వాహనాలను సీజ్‌ చేశామని తెలిపారు. సర్కిల్‌ పరిధిలో పాత నేరస్తులను గుర్తించి 206 మందిని ఆయా మండలాల తహసీల్దార్ల ఎదుట బైండోవర్‌ చేశామన్నారు.

రేపు శ్రామిక మహిళా దినోత్సవం



కామారెడ్డి టౌన్‌: తెలంగాణ ప్రొగ్రెసివ్‌ టీచర్స్‌ ఫెడరేషన్‌ (టీపీటీఎఫ్‌) ఆధ్వర్యంలో ఈ నెల 10న శ్రామిక మహిళా దినోత్సవం నిర్వహిస్తున్నట్లు మహిళా విభాగం ప్రతినిధి ఎస్‌ నళినిదేవి తెలిపారు. శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడారు. సామాజిక బాధ్యత అనే అంశంపై చర్చాగోష్టి కార్యక్రమం ఉంటుందన్నారు. పాత రాజంపేట్‌లోని లేపాక్షి హోమ్స్‌ కమ్యూనిటీ హాల్‌లో ఉదయం 10 గంటలకు జరిగే ఈ కార్యక్రమానికి జిల్లాలోని మహిళా ప్రతినిధులు హాజరై విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మీనా భూషణ్‌, లక్ష్మి, విజయశ్రీ తదితరులున్నారు.

పశువుల ఎరువు.. ధర దరువు

- పసుపు సాగు చేసే నేలల్లో చల్లిస్తున్న రైతులు
- రూ.32వేల నుంచి రూ.42వేలకు చేరిన లారీ ఎరువు ధర





మోర్తాడ్‌లో రైతులు నిల్వ చేసుకున్న పశువుల పేడ, కొత్తపల్లిలో పొలాల్లో పోసిన ఎరువు కుప్పలు

మోర్తాడ్‌/బాల్కొండ: పశువుల పేడ ధరకు రెక్కలు తొడగటంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. పసుపు సాగు చేసే పొలాల్లో పశువుల పేడను చల్లిస్తే భూసారం పెరగడంతో పాటు పంట నాణ్యత వృద్ధి చెందుతుందని రైతులు చెబుతున్నారు. నిన్న మొన్నటి వరకు ఉన్న ధరల కంటే ఇప్పుడు ధర గణనీయంగా పెరగడంతో పశువుల పేడ కొనుగోలు తీవ్ర ఆర్థిక భారం మోపుతుందని రైతులు వాపోతున్నారు. మేకలు, గొర్రెల పేడ ఒక లారీ లోడ్‌కు రూ.32వేలుగా ఉన్న ధర ఇప్పుడు రూ.10వేలు పెరిగి రూ.42వేలకు చేరింది. కోళ్ల పేడ లారీ లోడ్‌ ధర రూ.30వేలు ఉండగా రూ.36వేలకు చేరింది. గేదెల పేడ లారీ లోడ్‌ మాత్రం రూ.18వేలకు లభిస్తుంది. గొర్రెలు, మేకలు, కోళ్ల పేడను వినియోగిస్తేనే పసుపు పంట దిగుబడి, నాణ్యత బాగుటుందని రైతులు తెలిపారు. పసుపు ధర రూ.15వేల నుంచి రూ.16వేల వరకు చేరడంతో వ్యాపారులు పశువుల పేడ ధరలను అమాంతం పెంచారని రైతులు చెబుతున్నారు. పసుపు పంటకు ధర ఇప్పుడే పెరిగిందని 14ఏళ్ల పాటు అంతంత ధరనే లభించిందని రైతులు అంటున్నారు.

పంటకు ధర ఉండటంతో..

పసుపు పంటకు ప్రస్తుతం ధరలు ఆశాజనకంగా ఉండటంతో వచ్చే ఏడాది కూడా పసుపు సాగు చేయడానికి రైతులు ప్రణాళిక చేసుకుంటున్నారు. దీంతో ఎరువులకు డిమాండ్‌ పెరిగింది. జొన్నకోతలు కూడా జోరందుకోవడంతో ఎరువులను తవ్వించడానికి రైతులు సిద్ధం అవుతున్నారు. ప్రధానంగా పసుపు పంట సాగు చేయుటకు నల్లమట్టి, సేంద్రియ ఎరువులు ఎక్కువగా వినియోగిస్తారు. సేంద్రియ ఎరువుల్లో అధికంగా పశువుల పేడ, గొర్రెలు, మేకలను ఎక్కువ వినియోగిస్తారు. గొర్రెల, మేకల పేడ నేలలో వేయడంతో తేమ శాతం తగ్గి పసుపు పంటకు దుంపకుళ్లు సోకకుండా ఉంటుందని రైతులు చెబుతున్నారు. ఎకరానికి మూడు నాలుగు లారీల ఎరువు అవసరం అవుతుంది.

ధరలు పెంచారు..



గొర్రె, మేకల పేడ లారీకి రూ.40 వేల వరకు పలుకుతోంది. పసుపు పంటకు ప్రస్తుత సంవత్సరం మంచి ధర ఉండటంతో వచ్చే సంవత్సరం ఎక్కువగా సాగు చేయుటకు సిద్ధమవుతున్నాం. దీంతో ఎరువుల ధరలను కూడ పెంచేశారు. – గోపిడి రాజారెడ్డి, రైతు, కొత్తపల్లి



వెదురు రెయిలింగ్‌..



సాధారణంగా జాతీయ రహదారికి ఇరువైపులా ఇనుప రెయిలింగ్‌ ఏర్పాటు చేస్తారు. ప్రమాదాలు జరిగి వాహనాలు ఈ రెయిలింగ్‌ను ఢీకొన్నప్పుడు ప్రాణ, ఆస్తి నష్టం ఎక్కువగా జరుగుతుంది. దీంతో ప్రమాదాల తీవ్రత తగ్గించడానికి హైవే అధికారులు క్రాష్‌ బారియర్‌ రెయిలింగ్‌ను ఏర్పాటు చేశారు. జిల్లా పరిధిలో జాతీయ రహదారి 44పై ప్రమాదాలు జరిగే పది ప్రాంతాల్లో బ్యాంబూ(వెదురు బొంగులతో) రెయిలింగ్‌ ఏర్పాటు చేశారు. ప్రమాదం జరిగినప్పుడు వాహనాలు కిందపడకుండా వెదురుబొంగులు ఆపుతాయి. అంతేగాకుండా వేగంగా ఢీకొన్నా.. ప్రాణ, ఆస్తి నష్టం తక్కువగా జరుగుతుందని అధికారులు చెబుతున్నారు. – సాక్షి స్టాఫ్‌ ఫొటోగ్రాఫర్‌, నిజామాబాద్‌



ఎట్టకేలకు గెజిట్‌

- ఆర్మూర్‌ మున్సిపల్‌ చైర్‌పర్సన్‌పై అవిశ్వాస తీర్మానం నెగ్గింది
- గెజిట్‌లో నోటిఫై చేసిన రాష్ట్ర ప్రభుత్వం



ఆర్మూర్‌ మున్సిపల్‌ కార్యాలయం

ఆర్మూర్‌: ఆర్మూర్‌ మున్సిపల్‌ చైర్‌పర్సన్‌ పండిత్‌ వినీత్‌పై కౌన్సిలర్లు ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానం నెగ్గిందంటూ రాష్ట్ర ప్రభుత్వం గెజిట్‌(రాజపత్రం)లో నోటిఫై చేసింది. దీంతో మూడు నెలలుగా ఆర్మూర్‌ మున్సిపాలిటీలో జరుగుతున్న గందరగోళ పరిణామాలకు తెరపడినట్లయింది. కలెక్టర్‌ సీడీఎంకు అందించిన నివేదిక ఆధారంగా రాష్ట్ర ప్రభుత్వ ప్రిన్సిపల్‌ సెక్రెటరీ దాన కిశోర్‌ తాజాగా ఆర్మూర్‌ మున్సిపల్‌ చైర్‌పర్సన్‌ పీఠం ఖాళీ అయిందని పేర్కొంటూ జీవో జారీ చేశారు. ఈ జీవో ఆధారంగా రాష్ట్ర ప్రభుత్వం గెజిట్‌లో నోటిఫై చేస్తూ రాజముద్ర వేసింది. మరో వైపు చైర్‌పర్సన్‌ ఎన్నిక నిర్వహించాలని కోరుతూ ఎన్నికల కమిషన్‌కు సైతం లేఖ రాసింది. దీంతో పార్లమెంట్‌ ఎన్నికల లోగా ఆర్మూర్‌ మున్సిపల్‌ చైర్‌పర్సన్‌ ఎన్నిక నిర్వహించడానికి అనువైన పరిస్థితులు నెలకొన్నట్లయింది. ఇప్పటికే కలెక్టర్‌ ఆర్మూర్‌ మున్సిపల్‌ బడ్జెట్‌ సమావేశం కోసం వైస్‌ చైర్మన్‌ షేక్‌ మున్నుకు ఇన్‌చార్జి చైర్‌పర్సన్‌గా బాధ్యతలు అప్పగిస్తూ తాత్కాలిక ఉత్తర్వులు జారీ చేశారు. చైర్‌పర్సన్‌ ఎన్నిక నిర్వహించే వరకు ఇన్‌చార్జి చైర్‌ పర్సన్‌ బాధ్యతలను వైస్‌ చైర్మన్‌ షేక్‌ మున్నుకు అప్పగించడానికి సైతం మార్గం సుగమమైంది.

'మహాలక్ష్మి' సాయం ఎప్పుడో?

- మహిళలకు నెలకు రూ.2500 ఇస్తామని హామీ ఇచ్చిన రేవంత్‌రెడ్డి
- బడ్జెట్‌లో నిధులు కేటాయించిన ప్రభుత్వం

మోర్తాడ్‌: మోర్తాడ్‌ మండలం తిమ్మాపూర్‌కు చెందిన రాజ్యలక్ష్మి బీడీ కార్మికురాలు అయినప్పటికి ఆసరా పథకం కింద జీవన భృతి అందడం లేదు. బీడీ కార్మికురాలైన ఆమెకు 2014 ఫిబ్రవరి తరువాత పీఎఫ్‌ ఖాతా లభించింది. అప్పటి బీఆర్‌ఎస్‌ ప్రభుత్వం జీవన భృతి అందించడానికి పీఎఫ్‌ ఖాతాలు ఫిబ్రవరి 2014లోపు పొంది ఉండాలనే కటాఫ్‌ నిబంధన విధించింది. తరువాతి కాలంలో కటాఫ్‌ తేదిని ఎత్తివేసినా జీవన భృతి అందించలేదు. ఇలా రాజ్యలక్ష్మితో పాటు మరెందరో మహిళలకు ఏ విధమైన ఆసరా ఫించన్‌ అందడం లేదు. అలాంటి గృహిణులు అందరికి రూ.2,500 ప్రతి నెలా మహాలక్ష్మి పథకం కింద ఆర్థిక సాయంగా అందిస్తామని సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించారు. సాధారణ అసెంబ్లీ ఎన్నికల సందర్భంలోనే కాకుండా కాంగ్రెస్‌ ప్రభుత్వం కొలువుదీరిన తరువాత అర్హులైన గృహిణులకు మహాలక్ష్మి పథకం కింద ఆర్థిక చేయూతను అందిస్తామని హామీ ఇచ్చారు. ఆరు గ్యారంటీలలో భాగంగానే మహాలక్ష్మి పథకం కింద ఆర్థిక సాయం అందించనున్నట్లు కాంగ్రెస్‌ పార్టీ ప్రధాన నేతలు మొదటి నుంచి చెబుతున్నారు.

మార్గదర్శకాల కోసం నిరీక్షణ

ఆరు గ్యారంటీల హామీల అమలు కోసం 2024–25 బడ్జెట్‌లో రాష్ట్ర ప్రభుత్వం రూ.53,196 కోట్లను కేటాయించింది. ప్రజాపాలనలో భాగంగా ఆసరా పింఛన్‌లను అందుకోని మహిళలు మహాలక్ష్మి సాయం కోసం దరఖాస్తు చేసుకున్నారు. మహాలక్ష్మి పథకం కింద ఆర్థిక సాయం అందించడానికి ప్రభుత్వం మార్గదర్శకాలను జారీ చేయాల్సి ఉంది. ఇప్పటికే జిల్లాలో 77,158 మంది వితంతువులు, 10,520 మంది ఒంటరి మహిళలు, 96,264 మంది బీడీ కార్మికులకు ఆసరా ఫించన్‌లు అందుతున్నాయి. ఆసరా పథకం కింద లబ్ధి పొందుతున్నవారికి మహాలక్ష్మి సాయం అందించే అవకాశం లేదు. ప్రభుత్వం మార్గదర్శకాలను జారీ చేస్తేనే ప్రతి నెలా సాయం అందుకునేవారి విషయంలో స్పష్టత రానుంది.

ఆదేశాలు రావాల్సి ఉంది

మహాలక్ష్మి పథకం కింద లబ్దిదారులను ఎంపిక చేసే విషయంలో ప్రభుత్వం నుంచి స్పష్టత రావాల్సి ఉంది. ప్రజాపాలనలో అనేక మంది దరఖాస్తులు అందించగా వాటిని ఆన్‌లైన్‌లో నమోదు చేసి ఉంచాం. ఎవరు అర్హులు, వారిని ఎలా గుర్తించాలి అని త్వరలో మార్గదర్శకాలు జారీ కావొచ్చు. – తిరుమల, ఎంపీడీవో, మోర్తాడ్‌

యథేచ్ఛగా ఇసుక దందా!



వెల్కటూర్‌ పెద్దవాగు నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్లు

బాల్కొండ: మెండోరా మండలంలోని పెద్ద వాగు నుంచి ఇసుక అక్రమ రవాణా యథేచ్ఛగా సాగుతున్నా పట్టించుకునే వారు కరువయ్యారు. మెండోరా మండలం వెల్కటూర్‌ శివారులో గల పెద్దవాగు నుంచి ఇసుకను అక్రమంగా తరలించుకుంటూ వ్యాపారులు సొమ్ము చేసుకుంటున్నారు. అధికారులు మామూళ్ల మత్తులో ఉండటంతో ఇసుక వ్యాపారులు రెచ్చిపోతున్నారు. ముప్కాల్‌ మండలం వెంచిర్యాల్‌, మెండోరా మండలం వెల్కటూర్‌, సావెల్‌ గ్రామాల శివారు నుంచి పెద్ద వాగు ప్రవహిస్తుంది. మోర్తాడ్‌ మండలం సుంకెట్‌ నుంచి వే బిల్లులతో ఇసుకను రవాణా చేస్తున్నారు. వే బిల్లులు ఒక చోటకు అనుమతి ఉంటే మరో ప్రాంతానికి తరలిస్తున్నారు. కానీ వెల్కటూర్‌ శివారులో పెద్ద వాగు నుంచి ఎలాంటి అనుమతులు లేకుండానే ఇసుకను తరలిస్తున్నారు. ఇష్టారీతిన తవ్వకాలు చేపడుతున్నారు. ప్రస్తుతం పలు గ్రామాల్లో సీసీ రోడ్ల నిర్మాణానికి ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. సీసీ రోడ్లకు అవసరమైతే అనుమతితో ఇసుకను తరలించవచ్చు. ఇలా చేయడంతో ప్రభుత్వానికి ఆదాయం వస్తుంది. కానీ సీసీ రోడ్ల నిర్మాణం పేరు చెప్పి ఇసుకను దండుకు పోతున్నారు. నిత్యం పదుల సంఖ్యలో ట్రాక్టర్లతో దందాను కొనసాగిస్తున్న అధికారులు మాత్రం పట్టించుకోవడం లేదు. కొత్త ప్రభుత్వం ఏర్పడి మూడు నెలలు కావస్తున్నా.. ఇసుక విషయంలో ఇప్పటి వరకు ఎలాంటి విధివిధానాలను తయారు చేయాలేదని అధికారులే చెబుతున్నారు. దీంతో వే బిల్లులతో కొన్ని చోట్ల ఇసుకను తరలిస్తున్నారు. ప్రభుత్వ పనుల పేరిట ఇసుక దందాను సాగిస్తున్నారు. సీసీ రోడ్ల పేరుతో ఇసుకను తరలించి సామాన్యులకు ట్రాక్టర్‌ ఇసుక రూ.6800కు విక్రయిస్తున్నారు. ఉన్నత అధికారులు స్పందించి ఇసుక అక్రమ రవాణాకు చెక్‌ పెట్టాలని పలువురు డిమాండ్‌ చేస్తున్నారు.

ఆలయాభివృద్ధికి కృషి చేస్తాం



ఎమ్మెల్యే, కలెక్టర్‌కు స్వాగతం పలుకుతున్న అర్చకులు

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): మండలంలోని త్రిలింగేశ్వరాలయ అభివృద్ధికి జిల్లాకలెక్టర్‌తోపాటు తాను కూడా కృషి చేస్తానని ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు సూచించారు. మహాశివరాత్రిని పురస్కరించుకొని నాగిరెడ్డిపేట మండలంలోని తాండూర్‌ గ్రామశివారులోని త్రిలింగేశ్వరాలయంలోని స్వామికి కలెక్టర్‌ జితేష్‌ వి పాటిల్‌తో కలిసి ఆయన అభిషేకాలు చేశారు. దీంతోపాటు స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ త్రిలింగేశ్వరాలయంలోని స్వామిపై తనకు అపారమైన నమ్మకం ఉందన్నారు. ఆలయ పరిసరాల్లో మరుగుదొడ్ల నిర్మాణం కోసం రూ.2 లక్షలు కేటాయించామన్నారు. ఎల్లారెడ్డి ఆర్డీవో ప్రభాకర్‌, ఎంపీపీ రాజ్‌దాస్‌, తహసీల్దార్‌ లక్ష్మణ్‌, డీఎస్పీ శ్రీనివాసులు, సీఐ రవీందర్‌ నాయక్‌ ఉన్నారు.

ముంబయికి ఆర్టీసీ బస్సులు లేవు!

- ప్రైవేట్‌ బస్సులను ఆశ్రయిస్తున్న జిల్లావాసులు
- ఇక్కడ నుంచి ముంబయికి వలసలు ఎక్కువ



ఖలీల్‌వాడి: నిజామాబాద్‌ నుంచి ముంబయికి ఆర్టీసీ బస్సులు నడవకపోవడంతో జిల్లా వాసులు ప్రైవేట్‌ ట్రావెల్స్‌ బస్సులను ఆశ్రయించాల్సి వస్తుంది. నిజామాబాద్‌, కామారెడ్డి, ఆర్మూర్‌, జగిత్యాల, కోరుట్ల, నిర్మల్‌ ప్రాంతాల నుంచి ఎక్కువ మంది ముంబయిలో వివిధ పనులు చేస్తూ జీవనం చేస్తున్నారు. దీంతో చాల కుటుంబాలు ముంబయిలో స్థిర నివాసం ఏర్పాటు చేయడంతో ఈ ప్రాంతాలకు తరుచు వస్తూ ఉంటారు. గతంలో ఆర్టీసీ వివిధ ప్రాంతాల నుంచి ముంబయికి బస్సులను ఏర్పాటు చేసింది. ప్రస్తుతం వాటిని రద్దు చేయడంతో ప్రైవేట్‌ బస్సుల్లో రాకపోకలు సాగిస్తున్నారు.

పండగ సీజన్‌లో ధరలు పెంపు

నిజామాబాద్‌, జగిత్యాల, నిర్మల్‌ నుంచి ప్రతి రోజు నాలుగు నుంచి ఆరు ప్రైవేట్‌ బస్సులు ముంబయికి నడుస్తున్నాయి. ఈ బస్సుల్లో సాధారణ రోజుల్లో రూ.1200 టిక్కెట్‌ ధరలు తీసుకోగా పండగ సీజన్‌లో రెట్టింపు చేస్తున్నారు. వేసవి, పండగ సీజన్‌లలో ఎక్కువగా ముంబయి, పుణే, భీమండిలలో నివాసించే వారు స్వగ్రామాలకు వస్తుంటారు. ఈ సమయంలో బస్సుల యాజమాన్యలు ధరలను పెంచేస్తున్నాయి. ప్రభుత్వం ధరల నియంత్రించాలని ప్రయాణీకులు కోరుతున్నారు. అంతేకాకుండా ఆర్టీసీ బస్సులను అందుబాటులో ఉంచాలని అంటున్నారు.

అందుబాటులో రెండు రైళ్లు...

నిజామాబాద్‌ రైల్వేస్టేషన్‌ నుంచి ముంబయికి రెండు రైళ్లు ప్రతి రోజు వెళ్తుంటాయి. ఎక్కువ మంది దేవగిరి ఎక్స్‌ప్రెస్‌లో ముంబయికి వెళ్లుత్తుంటారు. ఇది సాయంత్రం 4:30 గంటలకు నిజామాబాద్‌ రైల్వే స్టేషన్‌కు వస్తుంది. ఇటీవల కెఆర్‌ఎంఆర్‌ ఎల్‌ఎల్‌టీ రైలు అందుబాటులో ఉంది. నిజామాబాద్‌ రైల్వేస్టేషన్‌లో ఉదయం 11:30 వరకు ఉంటుంది.

ప్రతిపాదన వస్తే పరిశీలిస్తాం

ప్రయాణికుల నుంచి విజ్ఞప్తి వస్తే ముంబయికి బస్సులు నడిపే విషయం పరిశీలిస్తాం. ప్రయాణికుల నుంచి ప్రతిపాదన వస్తే ఉన్నతాధికారులకు పంపించిన తర్వాత నిర్ణయం తీసుకుంటాం. – జానీరెడ్డి, ఆర్టీసీ ఆర్‌ఎం

క్రైం కార్నర్‌

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి



జితేంద్ర మృతదేహం

బాల్కొండ: బాల్కొండ శివారులో జాతీయ రహదారి 44పై శుక్రవారం తెల్లవారు జామున జరిగిన రోడ్డు ప్రమాదంలో ఉత్తర్‌ప్రదేశ్‌కు చెందిన జితేంద్రకుమార్‌ చౌదరి(23) మృతి చెందాడు. ఎస్సై గోపి తెలిపిన వివరాలు.. జితేంద్రకుమార్‌ హైదరాబాద్‌లో ఓ కంపెనీలో కార్పెంటర్‌గా పని చేసుకుంటు జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలో హైదరాబాద్‌ నుంచి ఆదిలాబాద్‌ జిల్లా ఇచ్చోడకు ఫైవుడ్‌ సీట్లు టాటా ఏసీ వాహనంలో తీసుకు వెళ్తుండగా బాల్కొండ శివారులో వాహనం బోల్తా పడింది. డ్రైవర్‌ పక్కన కూర్చున్న జితేంద్రకుమార్‌కు తీవ్ర గాయాలయ్యాయి. ఆస్పత్రికి తరలిస్తుండగా మృతి చెందాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్సై తెలిపారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని ఒకరు..

సదాశివనగర్‌: మండలంలోని మర్కల్‌ చౌరస్తా వద్ద జాతీయ రహదారిపై శుక్రవారం ఉదయం గుర్తుతెలియని వాహనం ఢీకొని ఒకరు మృతి చెందారు. ఆంధ్రప్రదేశ్‌లోని శ్రీకాకుళం జిల్లా ఆముదాలవలస మండలం మునగవలస గ్రామానికి చెందిన దండుపాటి రామారావు(62) అదే గ్రామానికి చెందిన మరికొంత మందితో కలిసి తీర్థయాత్రల్లో భాగంగా ప్రత్యేక బస్సులో షిర్డీకి బయలుదేరారు. మర్కల్‌ చౌరస్తా వద్దకు రాగానే వాహనాన్ని రోడ్డు పక్కన నిలిపి టీ తాగి నడుచుకుంటు 44వ జాతీయ రహదారి దాటుతుండగా నిజామాబాద్‌ వైపు నుంచి కామారెడ్డి వైపు వెళ్తున్న గుర్తుతెలియని వాహనం రామారావును ఢీకొంది. తలకు బలమైన గాయం కావడంతో ఆయన అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి భార్య జయమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై రాజు తెలిపారు.

లారీ ఢీకొని యువకుడు..

మద్నూర్‌: ఆటోను లారీ ఢీకొనడంతో లింబుర్‌ గ్రామానికి చెందిన గౌలే చందు(30) మృతి చెందినట్లు హెడ్‌కానిస్టేబుల్‌ సాయన్న తెలిపారు. మండలంలోని సోనాల వద్ద శుక్రవారం ఈ ఘటన చోటు చేసుకుంది. మద్నూర్‌ నుంచి ఏడుగురు ప్రయాణికులతో ప్యాసింజర్‌ ఆటో సోనాల వైపు వెళ్తుంది. ఎదురుగా వస్తున్న లారీ మూలమలుపు వద్ద వీరిని ఢీకొనడంతో ఆటోలో ఉన్న చందు మృతి చెందగా చిన్నారులు ఓంకార్‌, గాలేగావ్‌ గాయపడ్డారు.

రైలు నుంచి పడి ఒకరి మృతి

ఖలీల్‌వాడి: నిజామాబాద్‌ రైల్వే పోలీస్‌ స్టేషన్‌ పరిధిలోని సిర్నాపల్లి, ఉప్పల్‌వాయి రైల్వే స్టేషన్‌ల మధ్య రైలు నుంచి జారీ పడి ఒకరు మృతి చెందినట్లు ఎస్సై సాయిరెడ్డి శుక్రవారం తెలిపారు. నగరంలోని దుబ్బా ప్రాంతానికి చెందిన భీమనపల్లి మార్కండేయ(54) రైలులో నుంచి కింద పడి పోవడంతో గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

చేపల వేటకు వెళ్లి ఒకరు..



లింగయ్య (ఫైల్‌)

ఎడపల్లి: ఎడపల్లికి చెందిన రెంజర్ల లింగయ్య(35) చేపల వేటకు వెళ్లి చెరువులో మునిగి మృతి చెందాడు. స్థానిక బొర్రన్న గుడి వద్ద పెద్ద చెరువులో చేపలు పట్టడానికి గురువారం వెళ్లిన లింగయ్య ప్రమాదవశాత్తు నీట మునిగాడు. దీంతో గురువారం గాలింపు చర్యలు చేపట్టినా ఆచూకీ లభించలేదు. శుక్రవారం చెరువులో మృతదేహం తేలింది. మృతుడి భార్య సౌజన్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని పోలీసులు తెలిపారు.

పీడీఎస్‌ బియ్యం పట్టివేత

ఇందల్వాయి: మండలంలోని గన్నారంలో పలు కిరాణా దుకాణాలపై పౌర సరఫరాల ఎన్‌ఫోర్స్‌మెంట్‌ అధికారులు శుక్రవారం దాడులు నిర్వహించారు. మూడు కిరాణా షాపుల నుంచి 44 క్వింటాళ్ల పీడీఎస్‌ బియ్యాన్ని స్వాధీనం చేసుకొని ఇందల్వాయి పోలీస్‌ స్టేషన్‌లో కేసు నమోదు చేసినట్లు తెలిపారు. పీడీఎస్‌ బియ్యం అక్రమంగా తరలిస్తే తమకు సమాచారం ఇవ్వాలని కోరారు. దాడుల్లో ఎన్‌ఫోర్స్‌మెంట్‌ అధికారులు మహేశ్‌కుమార్‌, ఆర్మూర్‌ డీటీ వినోద్‌ పాల్గొన్నారు.

కిరాణ దుకాణంలో చోరీ



ఎడపల్లి: మండలంలోని జానకంపేటలో పెద్ద హనుమాన్‌ ఆలయం వద్ద ఉన్న కిరాణ దుకాణంలో గురువారం రాత్రి చోరీ జరిగింది. అర్ధరాత్రి ఒంటి గంట సమయంలో ఓ వ్యక్తి ముందుగా హనుమాన్‌ ఆలయంలోకి వెళ్లాడు. అక్కడ విలువైన వస్తువులు కనిపించకపోవడంతో ఆలయం ముందు ఉన్న నాగరాజు కిరాణ దుకాణంలో చోరీ చేశాడు. రూ.1500 పోయినట్లు బాధితుడు తెలిపాడు. దొంగ కదలికలు సీసీ కెమెరాలో నమోదు అయ్యాయి. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

పేకాట స్థావరంపై దాడి

బాన్సువాడ రూరల్‌: మండల కేంద్రంలోని కొనాబాన్సువాడ శివారులో పేకాట స్థావరంపై శుక్రవారం దాడి చేసినట్లు సీఐ కృష్ణ తెలిపారు. పేకాడుతున్న ఐదుగురిని అరెస్టు చేసి, వారి నుంచి రూ.3,040 నగదు, నాలుగు ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు.

అల్లుళ్లతో కలిసి భర్త హత్య



మష్టాజీ(ఫైల్‌)

మద్నూర్‌: తనతో నిత్యం గొడవ పడుతున్నాడని మేనల్లుళ్లతో కలిసి భర్తను హత్య చేసిందో భార్య. ఈ ఘటన డోంగ్లీ మండల కేంద్రంలో జరిగింది. శుక్రవారం బాన్సువాడ రూరల్‌ సీఐ సత్యనారాయణ, హెడ్‌ కానిస్టేబుల్‌ సాయన్న తెలిపిన వివరాలు.. డోంగ్లీకి చెందిన సితాఫలే మష్టాజీ(45),అతని భార్య మాలన్‌బాయికి నిత్యం గొడవలు జరుగుతున్నాయి. దీంతో మష్టాజీని అంతం చేయాలని పథకం పన్నిన భార్య అల్లుళ్లు రాహుల్‌, అనిల్‌కు విషయం చెప్పింది. ఈ క్రమంలో మాలన్‌బాయి అల్లుళ్లు రాహుల్‌, అనిల్‌, మరోవ్యక్తిని గురువారం మధ్యాహ్నం ఇంటికి పిలిచి మష్టాజీతో మందు పార్టీ ఏర్పాటు చేసింది. మష్టాజీ మత్తులోకి జారుకున్నాక నలుగురు కలిసి కట్టెలు, ఇనుప పైపులతో ఆయనపై దాడి చేశారు. దీంతో అక్కడికక్కడే మృతి చెందాడు. గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించడంతో ఘటన స్థలాన్ని పరిశీలించారు. నలుగురిపై కేసు నమోదు చేసినట్లు సీఐ చెప్పారు. మష్టాజీకి కొడుకు మంగల్‌దీప్‌, కూతురు మనీషా ఉన్నారు.

కుటుంబ కలహాలతో ఆత్మహత్య



శ్రీనివాస్‌(ఫైల్‌)

మాక్లూర్‌:కుటుంబ కలహాలతో ఒకరు ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలోని వల్లభాపూర్‌లో చోటు చేసుకుంది. ఎస్సై సుధీర్‌రావు తెలిపిన వివరాలు..గ్రామానికి చెందిన కురుమ దెబ్బ శ్రీనివాస్‌(35)కు భార్య మానస, ఇద్దరు పిల్లలు ఉన్నారు. మానస తన పిల్లలతో కలిసి ఐదేళ్లుగా పుట్టింటి వద్దే ఉంటుంది. ఈ నెల 5న ఇంట్లో గొడవ జరగడంతో శ్రీనివాస్‌ బయటకు వెళ్లి తిరిగి రాలేదు. కుటుంబ సభ్యులు పలు చోట్ల గాలించినా ఆచూకీ లభించకపోవడంతో గురువారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. శుక్రవారం జన్నేపల్లి వాగులో మృతదేహం ఉన్నట్లు గుర్తించిన పశువుల కాపరులు పోలీసులకు సమాచారం అందించారు. ఘటన స్థలానికి వెళ్లిన పోలీసులు శ్రీనివాస్‌ మృతదేహంగా గుర్తించారు. గొడవ అనంతరం వాగులో దూకి ఆత్మహత్య చేసుకున్నట్లు భావిస్తున్నారు. కాగా తన భర్త మృతిపై అనుమానాలు ఉన్నాయని మానస పోలీసులకు ఫిర్యాదు చేసింది.